ప్రజాశక్తి
శనివారం 17 మే 2025
5
అల్లూరి సీతారామరాజు



19 నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: ఈ నెల 19 నుండి 28 వరకు పదవ తరగతి, ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ జరుగుతాయని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్ లో వేసవి సెలవులలో ఐదారు తరగతుల విద్యార్థుల కోసం ప్రథమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిభిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదవ, ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 7837 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని, వారి కోసం 46 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చెయడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ దూరం లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడి ఉండరాదన్నారు.

మన్యంలో భారీ వర్షం

▶▶ కూలిన నివాస గృహాలు ▶▶ 9 పశువులు మృత్యువాత



కూలిన ఇల్లు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయితీ గొందివలస గ్రామంలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా ఏకధాటిక కురిసిన వర్షానికి తామర్ల. చిన్న పొట్టన్న, గెమ్మెలి. వెంకట్రావు అనే గిరిజనుల రెండు నివాస గహాలు నేలమట్టం అయ్యాయి. ఈదురుగాలుల వర్షం కారణంగా హఠాత్తుగా గహాలు నేలమట్టమవడంతో వారి వారి వస్తువులతో పాటు వినియోగించే ఆహార పదార్థాలైన ధాన్యం, తదితర వంటి ఆహార దిన్సులు, వినియోగించే సామాగ్రిలు పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని బాధిత గిరిజనుల అంటున్నారు. ఈ విషయంపై మండల అధికారులు స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు అధికారులకు కోరుతున్నారు.



మృతి చెందిన పశువులు

హుకుంపేట: మండలానికి సమీపాన జికె మండ పంచాయతీ గడ్డిమర్రి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలకు పిడుగు పడి 9 పశువులు మృతి చెందాయి. చీడీపుట్టు గ్రామానికి చెందిన పశువుల కాపరులు తమ పశువులకు గ్రామ సమీపాన గల పొలాలలో మేతకు తీసుకొచ్చారు. ఆ సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. భారీ వర్షాలకు పొలానికి సమీపాన గల మామిడి చెట్టు కిందకు పశువులన్నీ చేరాయి. మెరుపులతో కూడిన పిడుగు పడటంతో 9పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి.



ట్రోఫీతో చిత్రకొండ జట్టు సభ్యులు, నిర్వాహకులు

ముగిసిన సమ్మర్ క్రికెట్ పోటీలు

- విజేతగా నిలిచిన చిత్రకొండ జట్టు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు మారెమ్మ తల్లి ఉత్సవాలను పురస్కరించుకొని గత నెల 24న ప్రారంభమైన మారెమ్మ సమ్మర్ క్రికెట్ పోటీలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. సీలేరు డిఎవి స్కూల్ క్రీడా మైదానంలో జరిగిన ఈ పోటీల్లో అల్లూరి జిల్లా జీకే వీధి, చింతూరు మండలాలతో పాటు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు చిత్రకొండ ప్రాంతాల నుండి క్రీడా జట్లు పాల్గొన్నాయి. ఇటీవల వర్షాల కారణంగా కొన్ని రోజులు క్రికెట్ పోటీలకు అంతరాయం ఏర్పడింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మళ్లీ క్రీడా పోటీలు నిర్వాహకులు ప్రారంభించి త్వరితిగతిలో పూర్తి చేశారు. శుక్రవారం జరిగిన క్రికెట్ ఫైనల్ పోటీల్లో చిత్రకొండ, సీలేరు జట్లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన సీలేరు జట్టు నిర్ణీత 10 ఓవర్లో 74 పరుగు చేసి ఆలౌట్ కాగా, అనంతరం చిత్రకొండ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 75 పరుగులు చేసి విజయం సాధించింది. విజేతగా నిలిచిన చిత్రకొండ జట్టుకు రూ.20వేలు నగదు, ప్రోఫీని, ద్వితీయ స్థానంలో నిలిచిన సీలేరు జట్టుకు రూ.10వేలు నగదు ట్రోఫీని ఏపీ జెన్కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ పాంగి దుర్జో చేతుల మీదుగా అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా జాన్, బెస్ట్ బౌలర్‌గా సుదర్శన్, ఆల్ రౌండర్‌గా శశికుమార్ నిలవగా వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఏడిఈ క్యాంపు దుర్గా శ్రీనివాస్, ఏఈఈ సిహెచ్ సురేష్, భవాని శంకర్, ఆర్ఎన్ రామకృష్ణ, జోగారావు, మాజీ ఉపసర్పంచ్ కార్య శ్రీనివాస్, వానపల్లి అప్పారావు, సీనియర్ క్రీడాకారులు మలసాల రమణ, నిర్వాహకులు సుందర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాలు దారుణం

- ఇకనైనా ప్రారంభం నుంచి విద్యపై దృష్టి పెట్టాలి

-మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, వేదికపై గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నుండే ప్రాథమిక విద్యపై విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం మండల పరిషత్ అధ్యక్షురాలు శెట్టి. నీలవేణి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు అరకులోయ శాసనసభ్యులు మత్స్యలింగం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఇటీవల యుద్ధంలో అమరులైన జవానులకు సభ నివాళులు అర్పించి ప్రారంభించారు. మండలంలో విద్యా వ్యవస్థ చాలా దారుణంగా ఉందని, ముఖ్యంగా ప్రాథమిక విద్యా దశలో విద్యార్థులు పరిస్థితి ఘోరంగా ఉందనీ అందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టి పెట్టి ప్రాథమిక విద్య నుంచి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు ఫలితాల బట్టి మండలంలో విద్యా వ్యవస్థ ఎంత దారుణంగా ఉందో అధికారులు గుర్తించాలని మండల జిల్లా పరిషత్ సభ్యుడు డి. గంగరాజు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో కనీసం అక్షరాలు నేర్పించక పోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైమరీ పాఠశాలలు ఒకేలా లేవని కొన్ని దారుణంగా ఉన్నాయని తెలిపారు. దీనికి మండల విద్యాశాఖ అధికారి బాలాజీ స్పందిస్తూ మండలంలో విద్యా వ్యవస్థ బాగుపడాలంటే ముఖ్యంగా గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు సహకారం ఎంతో అవసరం అని, వారు సహకరిస్తే విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావచ్చు అని తెలిపారు.

అనంతరం అరకులోయ శాసనసభ్యులు మత్యలింగం మాట్లాడుతూ, మండలంలో గిరిజనేతర ప్రాంతంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురై రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతుందని ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర ఉన్నట్లు అర్థమవుతుందని తెలిపారు. ఈ మధ్య జరిగిన సంఘటన దీనికి ప్రత్యేక ఉదాహరణగా చెప్పవచ్చునని, ఇప్పటికైనా గిరిజనేతర ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఎక్కడికక్కడే బోర్డులు పెట్టి స్వాధీనపరుచుకోవాలని సూచించారు. ఈ విషయంపై అల్లూరి జిల్లా కలెక్టర్ తో చర్చిస్తున్నానని తెలిపారు. పర్యాటకశాఖ ఆధీనంలో ఉన్న పర్యాటక కేంద్రాలకు స్థానికులకు ఎటువంటి రుసుము తీసుకోవద్దని తెలిపారు. మండలంలో సచివాలయల ల్లో పనిచేస్తున్న సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించట్లేదని సభ్యులు తెలిపారు. మండలంలో ప్రస్తుతం జ్వరాల సీజన్ ప్రారంభం కావడంతో గ్రామాల్లో స్ప్రేయింగ్ ముమ్మరం చేసి ఫాగ్ యంత్రాలు ఉపయోగించాలని సభ్యులు కోరారు. త్వరలో అన్నదాత సుఖీభవ ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలో అనేక మందికి అర్హత లిస్టులో పేర్లు లేకపోవడం పట్ల మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకువచ్చారు.

ఏవో ఉమా మాట్లాడుతూ, ఎవరు కూడా ఆందోళన చెందొద్దని పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు బుక్, రేషన్ కార్డు వంటివి తీసుకువస్తే నమోదు చేస్తామని తెలిపారు. మండలంలో 16500 మంది ఉపాధి హామీ పనికి వెళ్తున్నారని సభాముఖంగా తెలిపారు. ఈ నెల నుంచి ప్రతి ఒక్కరికి పేమెంట్లు పడతాయని ఒకవేళ పడకపోతే కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. మండలంలో ఎస్ఎంఐ పనితీరు బాగోలేదని ఎక్కడ ఏమి మంజూరైన ఆయా ప్రజా ప్రతినిధులకు తెలియపరచట్లేదని సభాముఖంగా సభ్యులు ప్రశ్నించారు. ఈ సమావేశంలో మండల శాఖ అధికారులతో పాటు మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు కె.మొస్య.ఎస్.రూతు తదితరులు పాల్గొన్నారు.



వెలుగుతున్న విద్యుత్ దీపం వద్ద సిబ్బంది, గ్రామస్తులు

గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరా

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- అనంతగిరి: చిమ్మ చీకట్లో గిరిజన గ్రామాలు- రెండు రోజులుగా నిలిచిన విద్యుత్ సరఫరా పేరుతో ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం వెలువడిన కథనానికి అధికారులు చర్యలు చేపట్టారు

స్పందించిన స్థానిక ట్రాన్స్కో ఉన్నతాధికారులు వి.సురేష్, లైన్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యాన సిబ్బంది రంగంలో దిగి యుద్ధ ప్రతిపాదికన మరమ్మతు పనులు చేపట్టి శుక్రవారం విద్యుత్ సరఫరా చేపట్టారు. మండలంలోని రెండు రోజులుగా ఈదురు గాలుల బీభత్సం, పిడుగుల వానతో ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతుకు గురయ్యాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో వాటి పనులను చేపట్టారు. మరమ్మతు చేపట్టి అనంతగిరి తో పాటు కాశీపట్నం. భీమవరం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేశారు దీంతో మండలంలోని ఆయా గ్రామాల గిరిజనుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం ఆదేశం

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సీలోని తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రతి నెల రేషన్ బియ్యం సకాలంలో అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెల ఇస్తున్న బియ్యాన్ని నిబంధనల ప్రకారం ఇళ్ల దగ్గరకు వెళ్లి అందజేయాలని కోరారు. ఏజెన్సీలో ప్రతి నెల సివిల్ సప్లై, జిసిసి డిపోలు, వాహనాల ద్వారా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎక్కడికక్కడ రేషన్ బియ్యం సకాలంలో పంపిణీ చేసే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

సమస్యల పరిష్కారానికి కృషి :ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీషాదేవి, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్ శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల నుంచి ప్రజలు రోడ్లు, మంచినీటి సౌకర్యం, భూ సమస్యలు, ఇతర సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి పత్రాలు అందిచారు. ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ ప్రతి దరఖాస్తు పరిశీలించి, సంబంధిత శాఖలకు పంపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

2వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-రంపచోడవరం

2025 మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించి ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆదివాసి జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కంగాల శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలన్నారు. జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకోవాలని కోరారు. వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఎస్టి బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఐటిడిఏల ద్వారా ట్రైకార్ రుణాలు నిరుద్యోగ యువతకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు శేఖర్, మడకం బంగారు బాబు, కొమరం సూర్యచంద్ర దొర, మట్ల కృష్ణారెడ్డి, కుంజం వెంకన్న దొర, కొండ్ల సత్యనారాయణ రెడ్డి, కారం రామన్న దొర ఇతర నాయకులు పాల్గొన్నారు.



ఐటిడిఎ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఆదివాసీ నాయకులు




ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న కలెక్టర్, జెసి

బాధిత కుటుంబానికి రూ.5 లక్షల సహాయం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గంజాయి కేసులో చిత్తూరు జిల్లా జైలులో రిమాండు ఖైదీగా ఉంటూ మృతి చెందిన సరమండ ప్రదీప్ కుమార్ (26) కుటుంబానికి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో అందజేసారు. జి.మాడుగుల మండలం గడుతూరు పంచాయతీ రాళ్లపుట్టు గ్రామానికి చెందిన సరమండ రాధాకృష్ణ కుమారుడు ప్రవీణ్ కుమార్ గంజాయి కేసులో పట్టు బడటంతో చిత్తూరు జిల్లా జైలులో రిమాండు ఖైదీగా ఉంటూ మృతి చెందాడు.జాతీయ మానవ హక్కుల సంఘం సిఫారసు మేరకు బాధిత కుటుంబానికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, డిఆర్ఒ కె.పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు డిడిఎంగా గౌరీ శంకర్



ప్రజాశక్తి-పాడేరు:నాబార్డు డిడిఎంగా వి.గౌరీ శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు నాబార్డు డిడిఎం చక్రధర్‌కు తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నాబార్డు డిడిఎంగా బదిలీ అయ్యింది. ఈయన స్థానంలో హైదరాబాద్ శాఖ నుండి వి. గౌరీ శంకర్ బదిలీపై వచ్చి విధుల్లో చేసారు. అనంతరం జిల్లా కలెక్టర్ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు.

19న మినీ మహానాడును విజయవంతం చేయండి

- టిడిపి పాడేరు ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి



ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఈనెల 19వ తేదీన అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో జరిగే మినీ మహానాడును జయప్రదం చేయాలని టిడిపి పాడేరు ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. పాడేరులోని కుమ్మరిపుట్టులో తన నివాసంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 19న కుమ్మరిపుట్టులో జరిగే నియోజక వర్గస్థాయి మినీ మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ మినీ మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గంలోని రాష్ట్ర నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ జడ్ పిటిసిలు, ఎంపిపిలు ఎంపిటిసిలు, సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కమిటీలు, పంచాయతీ, గ్రామ కమిటీ అధ్యక్షులు, టిడిపి, ఎన్ టిఆర్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వరదలను దృష్టిలో పెట్టుకొని ముంపు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్



మాట్లాడుతున్న సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-కూనవరం

గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని ముంపు ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీపీఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీమార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంపు లేని ప్రాంతంలో ముందుగా బఫర్ స్టాక్, బియ్యం, నిత్యవసర సరుకులు ఏర్పాటు చేయాలని కోరారు. వరదల సమయంలో ప్రత్యామ్నాయంగా ముంపు లేని ప్రాంతాల నుండి విద్యుత్ లైన్ వేయాలని కోరారు. వరదల సమయంలో ముంపు ప్రాంతాల్లో కరెంటు గురించి గతం నుండి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఏడాది భారీ వర్షాలు ఉంటాయని ఒకపక్క వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేయడంతో పోలవరం బ్యాక్ వాటర్ భయం ముంపు ప్రాంత ప్రజల్లో నెలకొందని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వ అధికారులు ఇంతవరకు ముంపుపై దృష్టి పెట్టకపోవడమంటే ముంపు ప్రాంత ప్రజలను గాలికి వదిలేయడమే అవుతుందని తెలిపారు. మండలాల్లో సమీక్ష సమావేశాలు నిర్వహించి తక్షణమే ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే శబరి పరివాహక గ్రామాలకు వరదల వలన కరెంటు ఇబ్బందులు లేకుండా మెయిన్ రోడ్డు మీదుగా నరసాపురం వరకు విద్యుత్ లైన్ కనెక్టివిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు మాడెం బాబు, బొగ్గ సుబ్బయ్య, పాయం సత్యనారాయణ, నానుపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సోడా శంకర్, బొగ్గా రామారావు, తెల్లం తమ్మయ్య, ఎంపిటిసి ధర్ముల అమ్మాజీ, నాయకులు గడ్డిపాటి షణ్ముఖరావు, గుండం బాబురావు, తాళ్ళూరి శ్రీనివాసరావు, న్యాయవాది మడివి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, దీని వల్ల మురికి నీరు ఇంకుడు గుంతలోకి వెళ్లడం వలన అనారోగ్యాలకు గురికాకుండా ఉండవచ్చని ఎన్ఆర్ఇజిఎస్ జెఇ కత్తుల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయితీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒక క్యూబిక్ మీటర్‌కు రోజు వేతనం రూ.290 నుండి రూ.307 వరకు గరిష్టంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.18 సంవత్సరాల నిండిన వారు ఉపాధి హామీ పనులు చేయడానికి పేర్లు నమోద చేయడం జరుగుతుందని, పెళ్లయిన వారు కొత్త జాబ్ కార్డు కావాలంటే ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని కోరారు. ఉపాధి పని చేసే ప్రతి శ్రామికుడు ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన బీమా పథకం, ప్రధానమంత్రి సురక్ష జీవన యోజన పథకాల కోసం ఆధార్ కార్డు జెరాక్స్ ఇచ్చి ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద ఎకౌంటు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఒక గుంత ఏర్పాటు చేసి ఇంట్లో వచ్చిన చెత్తను అందులో వేసినట్లయితే మూడు నెలలకు అది వర్మీకంపోస్టుగా తయారవుతుందనుఇ, ఇది పంట పొలాలకు ఎరువుగా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చిలకం శంకర్, మెట్లు భూపతి, అశోక్, ముంజుపు శ్రీనివాస్, పెట్టా అనిల్ కుమార్, రేపు సింహాచలం, రేవు రాజారావు, ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.



ఇంకుడు గుంత తవ్వుతున్న దృశ్యం

పిజిఆర్ఎస్‌లో 75 వినతుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వేసవిలో ఏజెన్సీ వారపు సంతల్లో షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంచార్జి ఐటిడిఎ పిఒ, జెసి ఎంజె అభిషేక్ గౌడ, డిఆర్ ఒ కె.పద్మలతతో కలిసి అర్జీదారుల నుండి 75 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని వడగాల్పులు తగల కుండా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. గ్రామాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వారపు సంతల్లో ఆశీల పాడుకున్న కాంట్రాక్టర్లతో షెడ్ నెట్లు ఏర్పాటు చేయించాలని చెప్పారు. వర్షపు నీటి సంరక్షణ పనులు చేయాలని అధికారులకు సూచించారు. రోడ్లకు ఇరువైపులా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలలో మొక్కలు నాటాలని సూచించారు. వేసవిలో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వారపు సంతల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పశువులకు తాగునీటి ట్యాంకులను నిర్మించాలన్నారు. సూర్యఘర్ సోలార్ విద్యుత్తు పథకంపై ప్రజలకు చైతన్యవంతం చేయాలని సూచించారు.

స్వీకరించిన ఫిర్యాదులు

అరకు మండలం హట్టగూడ గ్రామానికి చెందిన మహిళలు గొల్లోరి గంగమ్మ, జి.రాజ్యలక్ష్మి అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని, ముంచింగిపుట్టు మండలం మాకవరం పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాలకు జీడి తోటలకు నష్టం వాటిల్లిందని నష్ట పరిహారం మంజూరు చేయాలని ఎం.రామరాజు పడాల్ తదితరులు అర్జీ పత్రాలను అందజేసారు. పాడేరు మండలం కరకపుట్టు గ్రామానికి చెందిన కూడ నాగేశ్వరరావు పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసారు. డుంబ్రిగడ మండలం గుంటగన్నెల గ్రామానికి చెందిన వి.జ్యోతి, వి.మరియమ్మ తదితరులు పౌల్ట్రీ షెడ్డుకు విద్యుత్తు సదుపాయం కల్పించాలని కోరారు. ముంచంగిపుట్టు మండలం మాకవరం పంచాయతీ అరబీరు గ్రామం సమీపంలో నిర్వహిస్తున్న స్టోన్ క్రషరు నిర్వహణతో ఇబ్బందులు పడుతున్నామని స్టోన్ క్రషరు నిలుపుదల చేయాలని వినతి పత్రం సమర్పించారు. అనంతగిరి మండలం టెంకబుడ్డి గ్రామస్తులు జి.అప్పారావు, ఎస్.చిన్నయ్య తదితరులు కృష్ణాపురం నుండి టెంకబుడ్డి గ్రామం వరకు డబ్ల్యూబియం రోడ్డు నిర్మించాలని కోరారు. అనంతరం జాతీయ డెంగ్యూ దినోత్సవం ఫెక్సీని ఆవిష్కరించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ జమాల్ బాషా, టిడబ్ల్యూ డిడి ఎల్.రజని, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం.హేమలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ జవహార్ కుమార్, డిపిఒ పి.ఎస్.కుమార్, సిపిఒ ఎస్ఎన్ఆర్ కె.పట్నాయక్, ఎస్ఎంఐ డిఇ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రమణరావు కుటుంబాన్ని పరామర్శించిన రమాదేవి



సుభద్రాదేవిని పరామర్శిస్తున్న రమాదేవి

ప్రజాశక్తి -గాజువాక : ఇటీవల మృతి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు పివైవి రమణరావు కుటుంబ సభ్యులను సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి శుక్రవారం పరామర్శించారు. చిన్న గంట్యాడలోని ఆయన నివాసానికి వెళ్లి రమణరావు భార్య సుభద్రా దేవిని పరామర్శించారు. తుదిశ్వాస విడిచేవరకు పార్టీ కోసం కష్టపడిన గొప్ప వ్యక్తి రమణరావు అని రమాదేవి కొనియాడారు. గాజువాకలో పార్టీ అభివృద్ధికి రమణరావు చేసిన కృషి, కష్టం, ఆయన ఉద్యోగ ప్రస్థానం, ఇతరత్రా అనేక విషయాలను ఈసందర్భంగా ఆయన కుటుంబసభ్యులతో ప్రస్తావించారు. రమణరావు కుటుంబసభ్యులను పరామర్శించిన వారిలో ఐద్వా కార్యదర్శి వై సత్యవతి, సంతోషం, లక్ష్మి, సుమిత్ర ఉన్నారు

డెంగీపై అవగాహనా ర్యాలీలు





చింతపల్లి, డుంబ్రిగుడలో ర్యాలీలు చేపడుతున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-చింతపల్లి: జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతపల్లి మండల కేంద్రంలోని ఆర్‌వీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కే సౌమ్య ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెంట్ ఇంద్ర ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీటి గుంతల్లో నిలువనీరు ఉండటంతో దోమలు వృద్ధి డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. జ్వరం లక్షణాలు కనిపించగానే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రవీంద్రనాథ్ చౌదరి, ప్రాంతీయ ఆసుపత్రి వైద్యాధికారులు లావణ్య, ఎంపీహెచ్ఈఓ జాన్సన్, ఎంపీహెచ్ఎస్ శాంతామణి, ఏఎన్ఎంలు లక్ష్మమ్మ, పెంటా కుమారి, కోపూరు విజయలక్ష్మి, దిబ్బ వెంకట రమణమ్మ, వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు సత్యారావు, లక్ష్మణరావు, ప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్స్ అనిల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీలేరు : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జీకే వీధి మండలం సీలేరు పిహెచ్సి వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి ఆధ్వర్యాన సీలేరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, సౌమ్య మాట్లాడుతూ ప్రజలు మలేరియా డెంగ్యూ, టైఫాయిడ్, ఫైలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాల్లో భాగంగా నీటి గుంతలు పూడ్చివేసి పరిసరాలను పరిశుభ్రపరచడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎన్.త్రినాధ ఏఎన్ఎంలు అరుణ కుమారి, కెవిఎన్ కుమారి, ఆశా కార్యకర్తలు, సిహెచ్‌డబ్ల్యులు పాల్గొన్నారు.

జీకే వీధి: జీకే వీధి పిహెచ్ సి డాక్టర్ వినయ్ కుమార్, సబ్ యూనిట్ అధికారి కన్నబాబు అధ్వర్యంలో రింతాడ సచివాలయం 1 అసరాడ గ్రామంలో డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.దోమ తెరలు వాడాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని తెలిపారు.అసరాడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి జ్వర పీడితులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ సత్య నారాయణ, ఏఎన్ఎం భాగ్య లక్ష్మి, సచివాలయం ఏఎన్ఎం కుమారి, ఆశలు, అంగన్వాడీ టీచరు పార్వతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : ప్రజల్లో అవగాహన కల్పించడంతోనే డెంగ్యూ నియంత్రణ సాధ్యమని మండల వైద్య అధికారి రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ఫ్లెక్సీలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డుంబ్రిగూడ పురవీధుల గుండా డెంగ్యూ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మురుగునీరు నిల్వ లేకుండా చేసినట్లయితే డెంగ్యూ నివారణ చేయవచ్చు అన్నారు. ప్రజల్లో మూఢ నమ్మకాలను తొలగించవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని చెప్పారు. గ్రామ పరిసరాలతో పాటు ప్రతి నివాసగృహాల చుట్టూ పాత వస్తువులతో పాటు వ్యర్థ పదార్థాలు లేకుండా జాగ్రత్తపడితే సులువుగా డెంగ్యూ నివారణ చేయవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల:జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అడ్డతీగల మండలం ఎల్లవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నాగ ప్రత్యుష్య ఆధ్వర్యంలో ఎల్లవరం గ్రామంలో డెంగీపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. 'పరిశీలించండి - శుభ్రం చేయండి - మూతలు పెట్టండి' అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవి ప్రియాంక, పిహెచ్సి విస్తరణాధికారి శ్యాంబాబు, సబ్ యూనిట్ అధికారి అశోక్, శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



అడ్డతీగలలో ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

21 నుంచి జూపార్కులో విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతప్రదర్శనశాల, జివియంసి, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, యూత్ కన్జర్వేషన్ యాక్షన్ నెట్‌వర్క్ సంయుక్త ఆధ్వర్యంలో జూ పార్కులో ఈనెల 21 నుంచి 25 వరకు ఐదు రోజులపాటు విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూ పార్కు బయోస్కోపు మందిరంలో నిర్వహించే సమ్మర్ క్యాంపులో జంతు ప్రపంచం, వాటి పరిరక్షణ చర్యలపై ఆసక్తి, అవగాహనను పెంపొందించే దిశగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వీటితో పాటు జూ వెటర్నరీ ఆసుపత్రి సందర్శన, జంతు సంరక్షకులతో ఇంటరాక్టివ్ సెషన్లు, పక్షుల వీక్షణ, జంతువుల నివాసాలు, ఆహారపు అలవాట్ల అన్వేషణ ఉంటుందన్నారు. క్యాంప్‌లో పాల్గొనే వారికి క్యాంప్ సర్టిఫికేట్, జంతు థీమ్ టీర్టు, ఐజెడ్‌పి బుక్, జంతు సంబంధిత బ్రోచర్లు అందజేయనున్నట్టు తెలిపారు. దీనిలో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ 1,000లు చెల్లించాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వివరాలకు జూఎడ్యుకేషన్ ఆఫీసర్ (78936 32900)ను సంప్రదించవచ్చున్నారు.

ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు
జల్ జీవన్ మిషన్ లక్ష్యం

జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఇంటి ఇంటికి కొళాయి (హర్ఘర్ జల్) పథకం కింద కుటుంబానికి సరిపడా 55 ఎల్ పి సి డి నాన్యవంతమైన తాగునీటిని సరఫరా చేయడమే జల్ జీవన్ మిషన్ లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో శత శాతం ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేయాలని, 4970 గ్రామాలకు గాను, 1340 గ్రామాలలో శతశాతం సాధించడం జరిగినందున వెంటనే ఆయా గ్రామాలను హర్ ఘర్ జల్ గ్రామాలుగా ప్రకటించాలని సూచించారు. జిల్లాలో ఉన్న 2.40 లక్షల గృహాలకు గాను 1.22 లక్షల గృహాలకు పథకం అందించడం జరిగిందని, మిగిలిన 1.18 లక్షల గృహాలకు పథకం అందించడానికి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో చేర్చాలన్నారు. ఇప్పటికే డిక్లేర్ చేసిన గ్రామాల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుని లోపాలుంటే సరి చేయాలని సూచించారు. అదేవిధంగా మలమూత్ర రహిత గ్రామాలుగా తీర్చిదిద్ది వాటిని కూడా మలమూత్ర రహిత గ్రామాలుగా ప్రకటించాలన్నారు. అందుకు అవసరమైన తీర్మానాలను గ్రామ సభల ద్వారా ప్రకటించాలన్నారు. జల్జీవన్ మిషన్ కింద సుమారు రూ. 626 కోట్లు మంజూరు కాగా రూ.144 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, ప్రతి ఇంజినీరింగ్ అధికారికి టార్గెట్ నిర్ణయించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల విషయంలో పెదబయలు, ముంచింగిపుట్టు మండలాలలో వెనుకబడి ఉన్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలలో ఇంకా సుమారు 17 శాతం కేంద్రాలకు రన్నింగ్ వాటర్ టాయిలెట్ల నిర్మాణాలు పెండింగ్ లో ఉనందున వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారులు పారిశుద్ధ్య కమిటీలను చైతన్య పరచాలన్నారు. పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి జల జీవన్ మిషన్ పనులలో లోటుపాట్లను సరిచేయించ వలసిందిగా కోరారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ నీటిసరఫరా ఇంజినీరింగ్ అధికారి కె. జవహర్ కుమార్, కమిటీ సభ్యులు జిల్లా విద్యా శాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, ఐసిడిఎస్ ఇంచార్జ్ పిడి ఎస్తేరు, జిల్లా వ్యవసాయాదికారి ఎస్బిఎస్ నంద్, డిఆర్డిఎ ఎపిడి లాలం సీతయ్య, డిపిఆర్ఓ పి. గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు..

యుజెఎఫ్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆరు జిల్లాల జర్నలిస్టుల ఫోన్ నెంబర్లతో కూడిన హ్యాండ్ బుక్ ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో దినేష్ కుమార్ యూజేఎఫ్ హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరించారు. యూజేఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు, ఏపియుడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షులు కే.రాము మాట్లాడుతూ, యూజేఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్.ఎం.ఆర్.ఎన్ వర్మ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ గోవిందరాజులు, యుజెఎఫ్ కోఆర్డినేటర్ హరనాథ్, అల్లూరి జిల్లా ప్రతినిధి సూర్యారావు, చింతపల్లి ప్రతినిధులు ఆనందరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ముగిసిన ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంబెడెడ్ సిస్టమ్స్, 6జి కమ్యూనికేషన్లపై ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ కార్యక్రమం (ఎఫ్‌డిపి) శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఎన్ఐటి వరంగల్ నుంచి ప్రొఫెసర్ మహమ్మద్ ఫరూఖ్ హష్మి ఐఒటి అప్లికేషన్‌ల కోసం కృత్రిమ మేదస్సుపై వివరించారు. 6జిలో ప్రాముఖ్యత, సవాళ్ళను కమ్యూనికేషన్లు, ఆర్.ఎఫ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, సిస్టమ్ డిజైన్ అంశాలపై వివరించారు. 5జి, 6జి సెల్యూలర్ సిస్టమ్‌ల కోసం వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఛానల్ అంశాలు, సహకార కమ్యూనికేషన్ల, అనుకరణ నమూనాలను తదుపరి తరం 6జి వ్యవస్థనలను భద్రపరచడం, పారిశ్రామిక ఎంబెడెడ్ సిస్టమ్‌లలో 4.0 అప్లికేషన్ అభివృద్ధిని వివరించారు. ముగింపులో పాల్గొన్న ప్రతిభావంతులందరికీ గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్రకుమార్, ఎఫ్‌డిపి కన్వీనర్‌లు డాక్టర్ ఎస్.నీరజ, డాక్టర్ సిహెచ్.సుధీర్, డాక్టర్ టి.గౌరి, సర్టిఫికేట్‌లు అందజేశారు.



శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ ప్రతినిధులు

డీప్‌టెక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశ్రామిక శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యారంగం - పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ ప్రత్యేక పారిశ్రామిక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నగరంలోని టెక్ మహేంద్ర కార్యాలయంలో ప్రారంభించింది. ఈ సందర్భంగా డీప్‌టెక్ నైపుణ్య ఫౌండేషన్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా ముందుకు సాగుతున్న కొద్దీ యువ శ్రామిక శక్తి ఒక క్లిష్టమైన సవాలును ఎదుర్కొంటోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద యువ జనాభా ఉన్నప్పటికీ విద్యా పాఠ్యాంశాలు, పరిశ్రమ అవసరాల మధ్య అనుసంధానం లేకపోవడంతో ఆర్థిక పురోగతి మందగించే ప్రమాదం ఉందన్నారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య సహకారం లేకపోవడం ఈ అంతరానికి కీలక కారణమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టిపిఐ అదనపు డైరెక్టర్ సురేష్ బాతా, క్వాంట్ సిస్టమ్స్ డైరెక్టర్ శ్రీహరి, డబ్ల్యుఎన్ఎస్ లొకేషన్ లీడర్ ఆర్ఎల్.నారాయణ, టెక్ మహీంద్రా లీడర్‌షిప్ కౌన్సిల్ సభ్యుడు జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



మేయర్‌ను సత్కరిస్తున్న జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మేయర్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావును జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పివివి.నాగరాజు, జనరల్ సెక్రటరీ ఎం.సంజీవరెడ్డి, పలువురు అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మేయర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ నగర మేయర్ పదవిని అధిరోహించినందుకుగానూ అభినందనలు తెలుపుతూ శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈ సత్కార సభలో మేయర్ మాట్లాడుతూ జివిఎంసి చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను దక్కించుకున్న జివిఎంసి కాంట్రాక్టర్లు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఇప్పటికే పనులను పూర్తి చేసి, మిగిలిన పనులను ప్రారంభించేందుకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులను మంజూరు చేయాలని అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో మండుటెండలు విపరీతంగా ఉన్నందున వేసవి తాపానికి నగర ప్రజలు గురికాకుండా ఉండేందుకు జివిఎంసి అన్ని జోన్లలో ప్రజల కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేసిందని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన జోన్ -4లోగల జివిఎంసి ప్రధాన కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజలకు చల్లని తాగునీటిని అందించారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఉక్కు'లో సమ్మె సైరన్

ఈ నెల 20 నుంచి ప్రారంభం - జయప్రదం చేయాలని కార్మిక సంఘాల పిలుపు



ధర్నా చేస్తున్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 20 నుంచి కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. అదే క్రమంలో ఈ నెల 20న పర్మినెంట్ కార్మికులు ఒక్కరోజు సమ్మెకు దిగుతున్నారు. వాటిని జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం విశాఖ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన పలు డిమాండ్లపై స్టీల్‌ప్లాంట్ బిసి గేట్ వద్ద ధర్నా జరిగింది. స్టీల్ కార్మికులకు అక్రమంగా ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని, సస్పెన్షన్లు ఎత్తివేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను ఎవరినీ తొలగించరాదని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా సాగింది. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో అప్రకటిత ఎమర్జెన్సీని యాజమాన్యం అనుసరిస్తోందని అన్నారు. కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘిస్తూ యాజమాన్య వైఖరి ఉందన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా గళమెత్తిన కార్మిక సంఘాలపైనా, కార్మికులపైనా కక్ష సాధింపు చర్యలకు దిగడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో . పూర్తిస్థాయి ఉత్పత్తి జరగాలంటే తగిన మానవ వనరులు ఉండాలని యాజమాన్యానికి తెలీదా ? అని ఆయన ప్రశ్నించారు. కార్మిక సమస్యలను సృష్టిస్తూ యాజమాన్యం అనైతికంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ నెల 20న జరిగే సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికవర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్లాంట్‌లో సమ్మె జరిగి తీరుతుందన్నారు. స్టీల్ కార్మికులకు నేటికీ పూర్తి వేతనాలు చెల్లించడం లేదన్నారు. హెచ్ఆర్ఎకు కోత విధించి, కరెంటు ఛార్జీలు పెంచి కార్మికులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులను వారి ఉపాధి నుంచి దూరం చేసి స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులకు తీవ్ర విఘాతాన్ని సృష్టిస్తున్నారన్నారు. యాజమాన్యం ఇదే వైఖరిని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డివి.రమణారెడ్డి, టి.జగదీష్, జె.రామకృష్ణ, స్టీల్ సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి, నాయకులు పి.శ్రీనివాసరాజు, మరిడయ్య, టివికె.రాజు, వి.ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, మహేష్, రాజు, శ్రీనివాస్, స్టీల్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు బి.తౌడన్న, ఎఐటియుసి నాయకులు మసేన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

23న హైదరాబాద్.. 30న బెంగళూర్

విశాఖలో భూముల పిపిపికి రోడ్డుషోలు
కాపులుప్పాడలో 87.80 ఎకరాలపై పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య ప్రణాళిక
విఎంఆర్‌డిఎ తాజా కసరత్తు



మాట్లాడుతున్న ప్రణవ్ గోపాల్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో భూములను పిపిపిలో అభివృద్ధి చేసేందుకుగానూ ఈ నెల 23న హైదరాబాద్, 30న బెంగళూరులో విఎంఆర్‌డిఎ రోడ్డుషోలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్‌గోపాల్ శుక్రవారం సాయంత్రం విఎంఆర్‌డిఎ ఉన్నతాధికారులు, క్రెడాయ్, నరెడ్కో, ఎపిరెడా ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి దీక్షలో భాగంగా మధురవాడలోని 87.80 ఎకరాల భూమిని పబ్లిక్, ప్రైవేట్ పద్ధతిలో జాయింట్‌గా డవలప్‌చేసేందుకు అవకాశాలు ఉన్నాయని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు ఛైర్మన్ వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి విశాఖపట్నం వరకూ బీచ్ కారిడార్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా ఇప్పటికే డబల్ డెక్కర్ మోడల్‌లో డిపిఆర్ సిద్ధమైన మెట్రో రైలు ప్రాజెక్టు పనులను కూడా 3 నుంచి 6 నెలలో వ్యవధిలో ప్రారంభించే చర్యలపై సమావేశంలో చర్చించారు. ఇలా ప్రారంభించి వచ్చే మూడున్నరేళ్లలో అంటే 2029 నాటికి మెట్రో రైల్ ఆచరణ సాధ్యం చేసే దిశగా ప్రయత్నాలు చేయాలని తెలిపారు. పైన తెలిపిన 87.80 ఎకరాల భూమి కన్వెన్షన్ సెంటర్లు, హాస్పిటాలిటీ, రెసిడెన్షియల్, కమర్షియల్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర నిర్మాణాలకు అనువుగా ఉన్న ప్రదేశంగా విఎంఆర్‌డిఎ గుర్తించినట్లు ఛైర్మన్ వెల్లడించారు. మెట్రో స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలోనే ఈ ప్రదేశం ఉంటుందని, ముఖ్యమైన రహదారులతో అనుసంధానమై ఉందని తెలిపారు. డేటా సిటీ ఆఫ్ సౌత్ కాపులుప్పాడకు ఒక కిలోమీటరు దూరంలో ఐటి సిటీ ఉండడం వల్ల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాంతంలో అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని అభిప్రాయపడ్డారు.



స్నాతకోత్సవ వివరాలను వెల్లడిస్తున్న ప్రొఫెసర్ శాలివాహన

నేడు ఐఐపిఇ ఐదో స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (ఐఐపిఇ) స్నాతకోత్సవాన్ని ఈ నెల 17వ తేదీ శనివారం బీచ్ రోడ్‌లోని హోటల్ నోవటల్ వేదికగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందుస్థాన్ జింక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, హోల్ టైం డైరెక్టర్ అరుణ్ మిశ్రా హాజరవుతారని సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆంధ్ర యూనివర్సిటీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం 51 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. వీరిలో 15 మంది ఎంఎస్‌సి విద్యార్థులు, ఎనిమిది మంది పెట్రోలియం ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నారన్నారు. అదేవిధంగా ఈ ఏడాది నుండి పెట్రోలియం ఇంధన సంబంధిత రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికిగాను విద్యలో అసాధారణ ప్రతిభ కనబరిచిన అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విభాగాల నుండి ఇద్దరు బాలికలను ఎంపిక చేసి బంగారు పతకాలు అందజేస్తామన్నారు. ఓవరాల్ విభాగంలో ఒక విద్యార్థికి రాష్ట్రపతి బంగారు పతకం కూడా అందజేస్తామని వెల్లడించారు. అనంతరం ఆర్ అండ్ డి డీన్ కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థలో కెమికల్ ఇంజినీరింగ్, పెట్రోలియం ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్‌లలో బిటెక్, అప్లైడ్ జియాలజీలో ఎంఎస్సీ, డేటా సైన్స్ అండ్ మిషన్ లెర్నింగ్‌లో వెబ్ ఆధారిత ఎంటెక్, పలు విభాగాలలో పిహెచ్‌డి ప్రోగ్రాములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తమ సంస్థను హెచ్‌పిసిఎల్, ఒఎన్‌జిసి, ఒఐఎల్, గెయిల్, ఐఒసిఎల్ వంటి ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలు ప్రమోట్ చేస్తున్నాయని తెలిపారు. తమ సంస్థలో విద్యను అభ్యసించిన విద్యార్థులకు బిటెక్ విభాగంలో 93.75 శాతం, ఎంఎస్సీ అప్లైడ్ జియాలజీలో 86.66 శాతం, ఎంఎస్సీ అప్లైడ్ జియాలజీలో 100 శాతం ప్లేస్మెంట్స్ లభిస్తున్నాయని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఐఐటిఇ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ అధ్యక్షులు ప్రొఫెసర్ పికె.బానిక్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ హిమాంషు కాకతీ, ఐఐపిఇ రిజిస్ట్రార్ రాంపాల్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లను మోసం చేసిన కూటమి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వాలంటీర్ల వ్యవస్థను రోడ్డున పడేసి కూటమి ప్రభుత్వం యువతను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ధ్వజమెత్తారు. గతంలో వాలంటీర్‌గా పని చేసిన అంగటి శ్రీనివాసరావు తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం తెలిసి అతడిని వాసుపల్లి శుక్రవారం పరామర్శించారు. తక్షణమే సొంత నిధులు రూ.10 వేల నగదును అందజేసి భరోసా కల్పించారు. గతంలో 27వ వార్డు దొండపర్తి నెహ్రూ బజార్ 143 సచివాలయంలో అంగటి శ్రీనివాసరావు, ఆయన భార్య అంగటి పార్వతి దంపతులిద్దరూ వాలంటీర్లుగా ఉద్యోగాలు చేస్తూ కుటుంబం పోషించుకునేవారని అన్నారు. కూటమి హయాంలో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలను మోసం చేసి అందలం ఎక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తీరు మార్చుకొని వాలంటీర్లకు తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భారత్ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి ఈ శుక్రవారం నాలుగు వినతులు వచ్చాయని జివిఎంసి సిటీ ప్లానర్ కె.ధనుంజయ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.